## చంపాపేటలో అమ్మవారి గుడిలో విగ్రహం మాయం

**దశ, హైదరాబాద్:** చంపాపేట కటికొనుకుంట ప్రాంతంలోని అమ్మవారి ఆలయంలో విగ్రహం మాయమైన ఘటన కలకలం రేపింది. ఆలయంలో విగ్రహం కనిపించకపోవడంతో నిర్వాహకులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆలయానికి చేరుకుని పరిశీలించారు. విగ్రహం ఎలా మాయమైంది? ఎవరైనా అపహరించారా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుల కోసం గాలిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలాయనికి అన్నపూర్ణ పరస్కారం

❖ సతీష్ కుమార్ శర్మకు గురుపురస్కారం ప్రధానం

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయాస్వామి దేవాలయంకు దక్షిణ భారత దేశంలో ప్రముఖ దేవాలయాలకు మహాశాస్త సేవా సంఘం అందించే ప్రతిష్ఠాత్మకమైన అన్నపూర్ణ పురస్కారం లభించింది. ఈ సంఘం దక్షిణ భారతదేశంలో ఎంపికన 12 దేవాలయాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఈ దేవాలయం ఉండడం విశేశం. దీంతో పాటు దేవాలయ ప్రధాన అర్చకులు రేంటాల సతీష్ కుమార్ శర్మ దేవాలయంలో నిర్వహిస్తున్న విశేష పూజలతో పాటు ఆయన చేస్తున్న కార్యక్రమాలను గుర్తించిన సంఘం గురుపురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అర్చకులు మాట్లాడుతూ దేవాలయానికి అన్నపూర్ణ పురస్కారం, సతీష్ కుమార్ శర్మ గురుపురస్కారం అందుకోవడం హర్షణీయమని అన్నారు. అనంతరం పలువురు ఆయనకు శుభాకాంక్షలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో అనంతుల సూర్యనారాయణ, అనంతుల గణేష్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, యుగేందర్, శివ, వాసుదేవరావు, తేడ్ల ప్రభాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ప్రధమ అవార్డులు అందుకున్న సూర్యపేట ఫోటో జర్నలిస్టు

**దశ సూర్యాపేట ప్రతినిధి :** జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ2026 పోటీల్లో రాష్ట్ర స్థాయి ప్రధమ బహుమతి సూర్యపేట జిల్లాకు చెందిన ఏ. యాకయ్య సాక్షి ఫోటో జర్నలిస్టు శనివారం హైదరాబాద్ లోని IAS ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఆల్ ఇండియా ప్రెస్ క్లబ్ అధ్యక్షులచేతుల మీదుగా ఈ అవార్డులను అందజేశారు. కార్యకమంలో ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు విజయకుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజేష్, అరుణ, రమేష్, వనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న ఇరువురిని జిల్లా జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

# ఉద్యమ కెరటం సురవరం సుధాకర్ రెడ్డికి ఘనంగా జోహార్లు

**దశ, రామన్నపేట:** ప్రజా ఉద్యమాల కోసం జీవితాంతం పోరాడిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించిన సురవరం సుధాకర్ రెడ్డికి నల్లగొండ జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. నల్లగొండ గడ్డపై వామపక్ష ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు.

నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై ప్రజలకు విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, ఎస్ఎల్‌బీసీ, శ్రీశైలం ఎడమగట్టు కాలువ, డిండి ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. రైతులు, ప్రజల ప్రయోజనాల కోసం ఆయన అలుపెరుగని పోరాటం కొనసాగించారని కొనియాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సురవరం సుధాకర్ రెడ్డి ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ ప్రజల పక్షాన నిలిచిన ఉద్యమ నాయకుడని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంతం, వీరమల్ల వెంకటయ్య, గంగాపురం యాదయ్య, గంగాపురం వెంకటయ్య, పర్స సుదర్శన్, కళ్లం యాదయ్య, ఊట్కూరి కృష్ణ, వీసం గాలయ్య, పల్లె మల్లేశం, సీహెచ్. మల్లేశం, రచ్చ దయాకర్, గంజి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కుంట్లూర్‌లో మూడు గంటలుగా భారీ ట్రాఫిక్ జామ్

**దశ, పెద్ద అంబర్ పేట:** కుంట్లూర్ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాదాపు మూడు గంటలుగా వాహనాలు ముందుకు కదలకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరగడంతో కుంట్లూర్ పరిసర ప్రాంతాల్లో వాహనాలు బారులు తీరాయి. కార్లు, బైకులు, ఆటోలు, ఇతర వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిన పరిస్థితి నెలకొంది. దీంతో అత్యవసర పనులపై వెళ్లే వారు, ఉద్యోగులు, కుటుంబాలతో ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న దూరం ప్రయాణించడానికి కూడా గంటల సమయం పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ జామ్ కారణంగా కుంట్లూర్‌లోని ప్రధాన కూడళ్లు, అనుసంధాన రహదారులపై కూడా వాహనాల రద్దీ ప్రభావం కనిపిస్తోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు వెంటనే చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను క్లియర్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## 22ఏ నిషేధిత జాబితా నుంచి ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించాలి

❖ రాపోలు నిర్మలానరసింహ నేత, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి.

**దశ, రామన్నపేట:** 22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములు కూడా చేర్చడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నిర్మలానరసింహ నేత అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఒక సర్వే నంబర్‌లో కొంత మేరకు మాత్రమే నిషేధిత భూమి ఉన్నప్పటికీ, మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ఎలాంటి వివాదం లేని భూ యజమానులు సైతం రిజిస్ట్రేషన్, అమ్మకం, కొనుగోలు, బ్యాంకు రుణాలు వంటి అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ సొంత భూమిపై హక్కు ఉన్నప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం ఆందోళన కలిగించే విషయమన్నారు. రెవెన్యూ వ్యవస్థలో గ్రామస్థాయి నుంచే భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిషేధిత భూమి ఎంత మేరకు ఉందో స్పష్టంగా గుర్తించే పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. కొంత భాగం మాత్రమే 22ఏ నిషేధిత జాబితాకు సంబంధించినదైతే, మొత్తం సర్వే నంబర్‌ను కాకుండా సంబంధిత భూమిని మాత్రమే నిషేధిత జాబితాలో నమోదు చేసే విధంగా రికార్డులను శాస్త్రీయంగా సరిచేయాలని సూచించారు. పాత రికార్డులు, ప్రస్తుత భూ పరిస్థితులు, హక్కు పత్రాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను సమగ్రంగా పరిశీలించి, రికార్డుల్లో తప్పులు ఉంటే సులభమైన విధానంలో సరిచేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను అత్యంత సున్నితమైన ప్రజా సమస్యగా పరిగణించి సమగ్ర సమీక్ష చేపట్టాలని రాపోలు నిర్మలానరసింహ నేత కోరారు. నిర్దోషులైన భూ యజమానులను ఇబ్బందులకు గురిచేయకుండా, వారి విలువైన సమయాన్ని వృథా చేయకుండా గ్రామస్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించే విధానాన్ని తీసుకురావాలని అన్నారు. భూ హక్కుల విషయంలో పారదర్శకత, న్యాయం, ప్రజలకు సులభమైన సేవలు అందేలా తక్షణ చర్యలు తీసుకుని 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న తప్పులను సరిచేసి బాధిత భూ యజమానులకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం: జడ్జి శిరీష

**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ లేబర్ యాక్ట్, రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్, చైల్డ్ ప్రొటెక్షన్ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టం, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ కార్యదర్శి, సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. కోర్టు సిబ్బంది మన్నన్ ఖాన్, పాపయ్య, సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, కే. లింగచారి, పీడీ మణి, ఏఏపీసీ చైర్మన్ కొమ్మగోని మమత, విద్యార్థుల తల్లిదండ్రులు నాగు నిరోషా, పగుడాల నరేందర్, వెలిమినేటి నరేష్, భువగిరి మధు, మేకల నరేందర్, గర్ధాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వారాహి సిల్క్స్, సిల్వర్ జ్యువెలరీని ప్రారంభించిన మీనాక్షి చౌదరి, హీరో తేజ సజ్జ

**దశ, హైదరాబాద్ :** ప్రముఖ వస్త్ర, ఆభరణాల బ్రాండ్ వారాహి విస్తరణలో భాగంగా వారాహి సిల్క్స్ 6.0, వారాహి సిల్వర్ జ్యువెలరీ 2.0 లను వనస్థలిపురం క్రాస్ రోడ్‌లో హీరోయిన్ మీనాక్షి చౌదరి, హీరో తేజ సజ్జ కలిసి ప్రారంభించారు. వారాహి డైరెక్టర్లు మణిదీప్ యేచూరి, డా. స్పందన గారి మార్గదర్శకత్వంలో, నాణ్యత, ప్రత్యేక డిజైన్లు, సంప్రదాయం, ఆధునిక షాపింగ్ అనుభవాన్ని వినియోగదారులకు చేరువ చేయాలనే లక్ష్యంతో సంస్థ తన విస్తరణను కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు. వనస్థలిపురంతో పాటు దగ్గరలోని పరిసర ప్రాంతాల వినియోగదారులకు వారాహి కలెక్షన్లు మరింత చేరువ చేసేందుకు వనస్థలిపురంలో తాము ఈ శాఖను ఎంచుకున్నట్లు, జూబ్లీ హిల్స్‌లో ప్రారంభమైన వారాహి సిల్క్స్ ప్రస్థానం అనంతరం కూకట్‌పల్లి, పాట్నీ, నెల్లూరు, విజయవాడలకు విస్తరించింది. ఇప్పుడు వనస్థలిపురంలో ఆరో స్టోర్ ప్రారంభంతో బ్రాండ్ తన విస్తరణను కొనసాగిస్తోందన్నారు.

## ఇంటర్ పూర్తయిన వారికి 25న జాబ్ మేళా

❖ హెచ్‌సీఎల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక

**దశ, హన్మకొండ:** ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న 'టెక్ బీ ప్రోగ్రామ్' కోసం ఈ నెల 25న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోపాల్ తెలిపారు. హన్మకొండలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలోని ఐసీఎస్సెస్ కంప్యూటర్ కేంద్రంలో ఉదయం 11.30 గంటలకు అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. 202526లో MPC, జనరల్, ఒకేషనల్ విభాగాల్లో ఇంటర్ పూర్తి చేసిన వారు, కనీసం 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులు. ఎంపికైన వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో పాటు డిగ్రీ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. వార్షిక వేతనం రూ.2.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు ఉంటుంది. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్ తీసుకురావాలి. వివరాలకు 7569177071, 7981834205 నంబర్లను సంప్రదించవచ్చు.

## పసుమాములలో ఘనంగా కాటమయ్య బోనాలు

**దశ, పెద్ద అంబర్ పేట :** పసుమాముల గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య స్వామి బోనాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు, మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను తీసుకుని కాటమయ్య స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాటమయ్య స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గౌడ సమాజ ఆరాధ్యదైవమైన కాటమయ్య స్వామికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

# గురు పౌర్ణమి వేడుకల్లో ఘనంగా అధ్యాపకుల సన్మానం

**దశ ఓయూ:** నిజాం కళాశాలలో భారతీయ శిక్షణ్ మండల్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సతీష్ రాయికింది అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి జీవితంలో విద్య ఓ ఆభరణం వంటిదన్నారు. నేటితరం యువత చరవాణిని అధికంగా వినియోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. విద్యార్థులు ఏకలవ్యుడి పట్టుదలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని సూచించారు. నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచభూతారాధన ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు పరిసరాలను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. ప్రకృతి వనరులను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ మానవతా

విలువలను పెంపొందించుకోవాలని కోరారు. నాగ్‌పూర్ నుంచి హాజరైన కార్యక్రమ ముఖ్య వక్త, అఖిల భారతీయ అధికారి అజయ్ ధాక్రస్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు (ఏఐ) విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరమైన సాధనమే కానీ, ఎప్పటికీ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదన్నారు. విద్యార్థుల్లోని శక్తి, సామర్థ్యాలను వెలికితీయడమే భారతీయ శిక్షణ్ మండల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. డాక్టర్ సతీష్ రాయికింది, డాక్టర్ పూర్ణచందర్ మాట్లాడుతూ.. భారతీయ శిక్షణ్ మండల్ ఏర్పాటు, దాని ప్రస్థానం, భారతీయ విద్యా విధాన రూపకల్పనలో సంస్థ పాత్ర, క్రమశిక్షణతో కూడిన కార్యాచరణ, వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. అధ్యాపక వృత్తిలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ కే. వెంకటయ్య, డాక్టర్ లక్ష్మిలను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ శాస్త్రి, డాక్టర్ పోతన, డాక్టర్ ఆంజనేయులు, బీఎస్ఎం ప్రాంత సంఘటన మంత్రి దేవరాజు నాయక్, కళాశాల బీఎస్ఎం ప్రతినిధులు సంజన, గుణవర్ధన్, శరణ్య, రాజేష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్, డ్రగ్స్ అవగాహన సదస్సు

**దశ, ఓయూ:** ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అసెంబ్లీ హాల్‌లో శనివారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు, ఐదుగురు అధ్యాపకులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ భద్రత, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓయూ సిటీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. దాసు, సబ్ ఇన్‌స్పెక్టర్లు జయచందర్, కరుణాకర్, మేఘనా, మహిళా ఎస్ఐ కావ్యతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

## కొనసాగుతున్న పవిత్రోత్సవములు

### స్వామివారికి పట్టు పవిత్ర మాలలు అలంకరణ

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవములలో భాగంగా రెండవ రోజు యాగశాలలో హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో యజ్ఞాచార్యులు హరిచరణ్ ఆచార్యులు అనిల్ కుమార్ శనివారం స్వామివారికి పట్టు పవిత్ర మాలలు అలంకరించి ఆరాధనలు కొనసాగించారు. మధ్యాహ్నం నిత్య పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అందరికీ తీర్థప్రసాదాలు అందజేసి తదియారాధన అన్న ప్రసాదం అందజేశారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం యాగశాల లో హోమ కార్యక్రమాలు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న తీజ్ పండుగ

**దశ సూర్యాపేట ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో తీజ్ పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి వంకుడోత్ సేవ్య విజయ ఆధ్వర్యంలో తీజ్ పండుగ ఐదో రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకల్లో పాల్గొంటూ సంప్రదాయాలను కొనసాగించడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం తీజ్ పండుగను ఘనంగా నిర్వహిస్తూ గిరిజన సంస్కృతి, ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి తీజ్ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిచ్చమ్మ, సైది, నీలమ్మ, కవిత, ధ్వలి, సుశీల, లక్ష్మి, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ ఇచ్చే వరకు పోరాటమాగదు; దీక్షను ప్రారంభించిన పెద్దిరెడ్డి

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** వ్యవసాయ వాణిజ్య వ్యాపార పరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన సూర్యాపేట పట్ల పాలకులకు చిన్న చూపుఎందుకని మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్షాలు చేపట్టిన 9వ రోజు శనివారం రిలే నిరాహార దీక్షను ప్రారంభించి వారు మాట్లాడారు. సూర్యాపేట చుట్టూ పట్టణ ప్రాంతాల్లో రైలు మార్గాలు ఉన్నప్పటికీ సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ ట్రైన్ ను అలైన్మెంట్ మార్చడం పాలకుల కుట్రను భంగం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బుల్లెట్ ట్రైన్ ఉద్యమానికి ప్రజా ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని లేక పోతే ఉద్యమ ద్రోహులు గా మిగులుతారన్నారు. రోజు రోజుకు ప్రజాదరణ పెరుగుతున్న ఈ ఉద్యమానికి ప్రభుత్వం దిగి రావాల్సిందే నని ఆయన అన్నారు. ఈరోజు రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు రాపర్తి శ్రీనివాస్ గౌడ్, వారణాసి రమేష్, మల్లికార్జున్, గుణగంటి సురేష్, విజయ్, మల్లేశ్,మహేష్ , పద్మక్క దుర్గారావు ,శేఖర్ ,సంపత్ ,తూడి శ్రీనివాసరావు నజీర్, నాగార్జున మరికొందరు దీక్షలో కూర్చున్నారు. వారికి పూల మాలలు వేసి ఉద్యమ అభినందనలు తెలిపిన వారిలో మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్ , పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి, రమణాచారి, చల్లమల్ల నరసింహ, జీడి బిక్షం, కొత్తపల్లి శివకుమార్, మట్టపల్లి సైదులు , బుర్ర వెంకటేశ్వర్లు కునుకుంట్ల సైదులు, కారింగుల వెంకన్న,తన్నీరు వాసుదేవరావు, సట్టు నాగయ్య, అఖిల్, శేషగిరి పూర్ణ శశికాంత్,భయ్యా మల్లికార్జున్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి దీక్షను కూర్చున్న వారికి పండ్ల రసాలు అందజేసి దీక్ష విరమింప జేశారు.

## భవిష్యత్తు ఎలక్ట్రిక్ బైకులదే

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం మరింత పెరగనుందని ఎంజీవన్ భూమి ఎలక్ట్రికల్ బైక్ కంపెనీ వ్యవస్థాపకులు రంగారెడ్డి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అమ్మ గార్డెన్ ఎదురుగా ఉన్న ఎంఎన్ఆర్ బ్లాంకెట్ హాల్లో సీఅండ్ఎఫ్ సూర్యాపేట డీలర్ బూర మల్సూర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు, కాలుష్య సమస్యలకు ఎలక్ట్రిక్ వాహనాలు మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బైకుల వినియోగంతో ఇంధన ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జనార్దన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ పరిశీలన

### అధికారులు, గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడ్

**దశ, చిన్నంబావి:** చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయిపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీకి ఆనుకుని సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన మంచినీటి వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ట్యాంక్‌ను పునర్నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు కలిసి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై మంత్రి జూపల్లి కృష్ణారావు తక్షణమే స్పందించి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ (RWS) శాఖ అధికారులు గ్రామానికి చేరుకుని వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు చెందిన శంకర్ ఆధ్వర్యంలో అధికారులు మిషన్ల ద్వారా క్యూసీ పరిశీలన నిర్వహించారు. ట్యాంక్ ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, తదుపరి చర్యలకు సంబంధించిన వివరాలను సేకరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహాయ సహకారాలతో వాటర్ ట్యాంక్‌కు త్వరగా సాంక్షన్ వచ్చేలా సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేయాలని గ్రామ సర్పంచ్‌కు సూచించారు. గ్రామ సమస్యలపై సర్పంచ్ తక్షణమే స్పందిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటుండటంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జైపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్, ఉపసర్పంచ్ మాధవి మాధవ రెడ్డితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్

❖ పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు

**దశ, హైదరాబాద్:** బతుకమ్మ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026-సీజన్2' నిర్వహించనున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్‌బాబులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, కళారూపాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై యువత సృజనాత్మకతను ప్రోత్సహించేలా పోటీలను నిర్వహిస్తున్నట్లు దిల్ రాజు తెలిపారు. షార్ట్‌ఫిల్మ్‌లు, పాటలతో పాటు ఈసారి కొత్తగా జానపద పాటలు, ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోలు, ఆర్టికల్స్‌ను కూడా పోటీల్లో చేర్చినట్లు వెల్లడించారు. గతేడాది నిర్వహించిన యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్‌కు మంచి స్పందన లభించిందని, 500కు పైగా లఘుచిత్రాలు, బతుకమ్మ పాటలు అందాయని దిల్ రాజు తెలిపారు. ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని యువ ప్రతిభావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించాలని ఆయన కోరారు. క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ.. యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీయడంతో పాటు భవిష్యత్‌లో సినీ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, కళారూపాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు.

# నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

❖ *నంబర్ ప్లేట్లు లేని 50 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుని నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వాహనదారులు, పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోతే ప్రమాదాలు జరిగినప్పుడు లేదా నేరాలకు వాహనాలు ఉపయోగించిన సందర్భాల్లో వాటిని గుర్తించడం కష్టతరమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రజల భద్రత కోసమేనని, ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం, ఇతర ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం కొనసాగిస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.